మాజీ మంత్రి కేటీఆర్‌ జన్మదిన వేడుకలు

కుత్బుల్లాపూర్‌: కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, మాజీ మంత్రి కేటీఆర్‌ జన్మదినోత్సవాన్ని బుధవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ కట్‌ చేసి సంబురాలు చేసుకున్నారు. ఇదిలాఉంటే అసెంబ్లీలో ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు, ఎమ్మెల్యే వివేకానంద తదితరులు కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

దుండిగల్‌: కొత్తగా పట్టా పాస్‌బుక్‌లు పొందిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మాధవరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్‌ 28, 2024 వరకు పట్టా పాస్‌ పుస్తకాలు పొందిన రైతులు అర్హులని, ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు ఫారానికి రైతు పట్టా పాస్‌ బుక్‌, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్‌లను జత చేసి గండిమైసమ్మలోని మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు. అలాగే గతంలో బీమా చేయించుకున్న రైతులు మార్పులు, చేర్పులకు ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు షురూ



జగద్గిరిగుట్ట: డివిజన్‌ పరిధిలోని సంజయ్‌పూరి కాలనీలో రూ. 10 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల పనులు బధవారం ప్రారంభమయ్యాయి. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు.

పార్కులు మాయం..!

• మహాదేవపురంలో 167 ఎకరాల్లో వెంచర్‌ ఏర్పాటు • 14 పార్కులకు 9 పార్కుల కబ్జా

- అడ్డుకోవాలని స్థానికుల వినతి
- బిల్డర్‌పై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు

సుభాష్‌నగర్‌: వెంచర్‌ చేయాలంటే ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. అందులో ప్లాటు కొనుగోలు చేసి ఇల్లు కట్టుకునే వారికి భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా రోడ్లు, పార్కు, విద్యుత్‌ స్తంభాలు, తాగునీటి పైప్‌లైన్‌, ఇంకుడు గుంతలు, ప్రార్థన మందిరాలు, వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కార్యాలయం, చిల్డన్‌ పార్క్‌ వంటి సదుపాయాలు కల్పించాలి. అధికారులు కూడా వాటిని పరిశీలించిన తర్వాతనే ఆ వెంచర్‌కు అనుమతి ఇవ్వాలి. కానీ మొదట్లో అన్నీ ఉన్నట్లు చూపిస్తున్నా కొందరు బిల్డర్లు తర్వాత నిబంధనలు పాటించడం లేదు. దీనికి గాజులరామారంలోని మహాదేవపురం వెంచర్‌ను నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఆ కాలనీ ఏర్పడినప్పుడు 14 పార్కులు ఉండగా, అందులో 9 పార్కుల స్థలాలు కబ్జాకు గురికాగా ఇప్పుడు 5 పార్కులు మాత్రమే ఉన్నాయి. అయితే ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు కబ్జాకు గురైన పార్కుల బాగోతం వెలుగులోకి రాగా, ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు.

◆ గాజులరామారం డివిజన్‌ మహాదేవపురంలోని వివిధ సర్వే నంబర్లలో 167 ఎకరాల విస్తీర్ణంలో 1975లో అప్పటి గ్రామ పంచాయతీ అనుమతితో వెంచర్‌ చేశారు. సుమారు 1900 మేర ప్లాట్లు ఉండగా, 14 పార్కుల కోసం 83 వేల గజాల స్థలాన్ని వదిలిపెట్టారు. అంతేగాకుండా కాలనీ ప్రధాన రోడ్డును 100 ఫీట్లుగా చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే శరవేగంగా అభివృద్ధి చెందిన కూకట్‌పల్లి హౌసింగ్‌ బోర్డు దగ్గరగా ఉండడంతో మహాదేవపురంలో గత ఐదేళ్ల వ్యవధిలోనే 75 శాతం మేర నిర్మాణాలు వెలిశాయి. ఇక్కడ గజం విలువ రూ. 70 వేలు ఉండగా, ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉంటే రూ. లక్ష 30 వరకు పలుకుతోంది.



అక్రమ భవంతిని నేలమట్టం చేసిన దృశ్యం



పార్కు స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణం

దీంతో కొంతమంది కాలనీలోని పార్కులను కబ్జా చేశారు. సర్వే నంబర్‌ బై తో వాటిని ప్లాట్లుగా చేసి కోట్లాది రూపాయాలు గడించారు. ఇలా ఇప్పటికీ 9 ప్లాట్ల గాను 58 వేల గజాల స్థలాన్ని అప్పనంగా కాజేశారు. ప్రస్తుతం ఆ పార్కు స్థలాల్లో బహుళ అంతస్తులు నిర్మాణాలు వెలిశాయి.

పార్కుల కబ్జాపై కోర్టును ఆశ్రయించి..

తొమ్మిది పార్కుల కబ్జాపై కాలనీకి చెందిన కొంతమంది సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దీంతో 2019 సెప్టెంబర్‌లో కోర్టును ఆశ్రయించారు. దీంతో పార్కులు కబ్జాకాకుండా చూడాలని ఎలాంటి అనుమతులు ఇవ్వద్దని సంబంధిత అధికారులను ఆదేశించింది. అయినప్పటికీ కొంతమంది అలాగే నిర్మాణాలు చేపట్టడంతో 2023లో మరోసారి కంటెమ్ట్‌ వేయడం జరిగింది. దీంతో కోర్టు ఆదేశాల మేరకు అప్పటి కూకట్‌పల్లి జోనల్‌ కమిషనర్‌ రెండు నిర్మాణాల అనుమతులతో పాటు మరో ఏడింటి అనుమతులు, ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేశారు.

ఇటీవలే ఫిర్యాదు..

కాలనీలో పార్కు స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారంటూ స్థానికులు జూలై 15న ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ విజిలెన్స్‌ డిజాస్టర్‌ మేనేజ్‌మెంట్‌ కమిషనర్‌ రంగనాథ్‌ ఈ నెల 16న మహదేవపురంలోని కబ్జాకు గురైన పార్కులు, రోడ్లను పరిశీలించారు. ఓ నిర్మాణాన్ని సిబ్బందితో పాక్షికంగా కూల్చివేయించారు. అయితే తూతూ మంత్రంగా కూల్చివేతలపై ఈ నెల 20న మరోసారి కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో అదేరోజు సదరు నిర్మాణాన్ని రెండు జేసీబీలతో నేలమట్టం చేశారు.

పలు సెక్షన్ల కింద కేసు నమోదు..

మహాదేవపురంలోని 9 పార్కుల కబ్జాకు పాల్పడిన బిల్డర్‌ యాదగిరి రెడ్డిపై ఎన్‌ఫోర్స్‌మెంట్‌ వింగ్‌, విజిలెన్స్‌ వింగ్‌ అండ్‌ డిజాస్టర్‌ మేనేజ్‌మెంట్‌ వింగ్‌ అధికారులు బుధవారం జగద్గిరిగుట్ట పోలీస్‌ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ క్రాంతి కుమార్‌ తెలిపారు.

కబ్జాను అడ్డుకోవాలి..



భవిష్యత్‌ తరాల కోసం కాలనీలో 14 పార్కులు ఏర్పాటు చేశారు. అయితే ఇందులో ఏకంగా 9 పార్కులను ఓ వ్యక్తి కబ్జా చేస్తుంటే అధికార యంత్రాంగం ఏం చేస్తుంది.? కొంతమంది అవినీతి అధికారుల కనుసన్నల్లోనే ఈ తంతంగం నడిచింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి కబ్జాకు గురైన పార్కులను కాపాడాలి. లేకుంటే ఉన్న 5 పార్కులు కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

–ప్రసాద్‌ కాలనీ, జనరల్‌ సెక్రెటరీ

చర్యలు చేపట్టాం..



మహాదేవపురంలోనే తొమ్మిది పార్కుల కబ్జా విషయమై ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు విచారణ చేపడుతున్నారు. మిగితా ప్రాంతాల్లోనూ పార్కులు కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– మల్లారెడ్డి, గాజులరామారం ఉప కమిషనర్‌

నేడు బడీడు పిల్లలకు వ్యాక్సినేషన్‌

దుండిగల్‌: ఈ నెల 25న కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గవ్యాప్తంగా బడీడు పిల్లలకు ఉచితంగా జపానీస్‌ ఎన్‌సైపాలిటీస్‌ వ్యాక్సిన్‌ వేయనున్నట్లు కుత్బుల్లాపూర్‌ పీహెచ్‌సీ మెడికల్‌ అధికారి డాక్టర్‌ సుమలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ, సిబ్బంది శిక్షణ కార్యక్రమాలు పూర్తిచేశామని పేర్కొన్నారు. 18 సబ్‌సెంటర్లు, 119 అంగన్‌వాడీ కేంద్రాలు, 64 ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 45,346 మందికి 1–2 ఏళ్ల పిల్లలకు రెండుస్లారు, 5–15 ఏళ్ల వారికి ఒక డోస్‌ చొప్పున వ్యాక్సిన్‌ వేయనున్నట్లు ఆమె తెలిపారు.

బోనాల ఉత్సవాలకు రావాలని ఆహ్వానం

చింతల్‌: భగత్‌సింగ్‌నగర్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో ఈనెల 28 న ఆదివారం నిర్వహించనున్న ఆషాఢ బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు చంద్రనగర్‌లోని కార్పొరేటర్‌ కార్యాలయంలో రంగారెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ బి.విజయశేఖర్‌ గౌడ్‌ , చింతల్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ రషీదా మహమ్మద్‌ రఫీకి ఆహ్వాన పత్రికలను బుధవారం అందజేశారు. వారిలో గుజ్జుల శ్రీనివాస్‌ రెడ్డి, సాంబయ్య, సామ్రాట్‌, గిరినాల ప్రభాకర్‌, శ్రీధర్‌ గౌడ్‌, చందు, బొట్టు వెంకటేశ్‌, సుభాష్‌, సభ్యులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

నిజాంపేట్‌: ప్రగతినగర్‌లోని అంబీర్‌చెరువులో దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం కూకట్‌పల్లి జోన్‌ సీనియర్‌ ఎంటలమాజిస్ట్‌ సంధ్య సూచన మేరకు సూపర్‌వైజర్‌ డి.నరసింహులు ఆధ్వర్యంలో అంబీర్‌ చెరువులో మస్కిటో ఆయిల్‌బాల్స్‌ను వదిలారు. వర్షాకాలం నేపథ్యంలో చెరువులో దోమల గుడ్లు, పిల్లలు వృద్ధి చెందే అవకాశముందని, ఆయిల్‌బాల్స్‌తో దోమల లార్వా నివారించబడతాయని అధికారులు పేర్కొన్నారు. అంబీర్‌ లేక్‌ వాకర్‌ అసోసియేషన్‌ సభ్యులు నగేశ్‌, గరికపాటి సాంబశివరావు, ప్రశాంత్‌ తదితరులు ఉన్నారు.

రాంగ్‌రూట్‌ డ్రైవింగ్‌ నివారణకు చర్యలు



కుత్బుల్లాపూర్‌: రాంగ్‌రూట్‌ డ్రైవింగ్‌ నివారణకు చర్యలు చేపట్టినట్లు సీఐ నాగరాజు పేర్కొన్నారు. ఆల్వాల్‌ ట్రాఫిక్‌ పీఎస్‌ పరిధిలోని పలు చౌరస్తాలు, ప్రధాన రహదారుల వెంబడి బుధవారం రాంగ్‌రూట్‌ ప్రొహిబిట్‌ బోర్డులను అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీసు రోడ్లు, జంక్షన్ల వద్ద రాంగ్‌ రూట్‌ డ్రైవింగ్‌తో ట్రాఫిక్‌ జాం తలెత్తుతోందని, వీటిని నివారించడానికి ఇప్పటికే స్పెషల్‌ డ్రైవ్‌లు నిర్వహిస్తూ పట్టుబడిన వాహనదారులకు కౌన్సెలింగ్‌ ఇచ్చామన్నారు. రాంగ్‌రూట్‌ ప్రొహిబిట్‌ బోర్డుల ఏర్పాటుతో వాహనదారుల్లో మార్పును తీసుకువచ్చేందుకు యత్నిస్తున్నామని పేర్కొన్నారు.

బస్సులు నడపాలని డీఎంకు వినతి



డీఎం ఆంజనేయులుకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జీడిమెట్ల: ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా బస్సులు నడిపించాలని బీజేపీ జిల్లా కన్వీనర్‌ మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్‌ అసెంబ్లీ కన్వీనర్‌ శేఖర్‌ యాదవ్‌ కోరారు. ఈ మేరకు జీడిమెట్ల డిపో మేనేజర్‌ ఆంజనేయులుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసియాలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడగా పేరుగాంచిన జీడిమెట్లలో కార్మికులు ఎక్కువగా ఉంటారని, వీరి సౌకర్యార్థం కేపీహెచ్‌బీ నుంచి వయా జగద్గిరి గుట్ట, షాపూర్‌ నగర్‌, జీడిమెట్ల, దూలపల్లి కొంపల్లి వరకు బస్సులు నడిపించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ రావుల శేషగిరి, డివిజన్‌ అధ్యక్షుడు శ్రీరాములు, మాజీ స్టేట్‌ ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌ ఎంఎస్‌ వాసు, విజయ్‌, మాలాశ్రీ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు

డంప్‌యార్డుగా రాజీవ్‌ గృహకల్ప పార్కు..!

జగద్గిరిగుట్ట: 'ఎక్కడపడితే అక్కడ వేయవద్దని.. స్వచ్ఛ్‌ ఆటోలోనే వేయాలని' ఓ వైపు అధికారులు, సిబ్బంది ప్రచారాలు చేస్తున్నప్పటికీ కొంతమంది తీరు మాత్రం మారడం లేదు. రాత్రింబవళ్లు షిఫ్టులుగా డ్యూటీలు చేస్తూ.. కాలనీల్లోని గోడలపై ప్రచారాలు చేస్తూ, ఇంటింటికీ తిరుగుతూ చెత్త వలన కలిగే అనర్థాలను వివరించినా మార్పు మాత్రం కనిపించడం లేదు. ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ్‌ ఆటోలో చెత్తను వేస్తే డబ్బులు ఇవ్వాల్సి వస్తుందన్న నేపథ్యంలో కొందరు ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేస్తుండడంతో పరిసరాలు డంప్‌యార్డును తలపిస్తున్నది.



పార్క్‌ వద్ద వేసిన చెత్త

బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం

కుత్బుల్లాపూర్‌: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగిందని తెలంగాణ బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్‌ అన్నారు. కొంపల్లిలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిపించినా రాష్ట్రానికి మాత్రం మొండి చేయి చూపించి బీహార్‌, ఆంధ్రప్రదేశ్‌ లాంటి రాష్ట్రాలకు నిధులు కేటాయించడం తగదన్నారు. బీసీల కోసం రూ. 2 లక్షల కోట్ల బడ్జెట్‌ కేటాయించాలని, అప్పుడే కులస్తులకు మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

పేకాటస్థావరాలపై దాడి

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట, భూదేవి హిల్స్‌ ప్రాంతాల్లోని పేకాటస్థావరాలపై బాలానగర్‌ ఎస్‌ఓటీ పోలీసులు బుధవారం దాడి చేశారు. 13 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 70 వేలు, 13 మొబైల్‌ ఫోన్లు, 7 సెట్ల ప్లేయింగ్‌ కార్డ్స్‌ను స్వాధీనం చేసుకుని జగద్గిరిగుట్ట పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ క్రాంతికుమార్‌ తెలిపారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలి



అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి డివిజన్‌ పార్టు, హైదర్‌నగర్‌, ఆల్విన్‌కాలనీ డివిజన్‌ల పరిధిలో చేపట్టవలసిన పనులు, పలు సమస్యలపై డీసీ కృష్ణయ్య, డీసీ మోహన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్‌ విభాగం, జలమండలి, టౌన్‌ప్లానింగ్‌, వీధిలైట్లు, శానిటేషన్‌ అన్ని విభాగాల అధికారులతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ, అన్ని విభాగాల అధికారులు కలిసి సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా పనిచేయాలన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, ప్రజా సమస్యలపై అధికారులు నిర్లిప్తతను వీడాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై స్పందించాలన్నారు. ప్రజావసరాల దృష్ట్యా కాలనీలో నెలకొన్న రోడ్ల సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా పరిగణలోకి తీసుకొని త్వరగా పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని, పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుంఠ అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలకు మాన్‌సూన్‌సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చూడాలని, అవసరమున్న చోట యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులకు తెలిపారు. ప్రజలకు అవసరమైన పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణలో క్షేత్ర స్థాయిలో అసంపూర్తిగా పని చేస్తున్నారని, ప్రజలకు ప్రజా సమస్యలు పరిష్కరించకుండా, ఇబ్బంది కలిగించే విషయంలో ఉపేక్షించే ప్రసక్తే లేదని అధికారులకు తెలిపారు. కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత

కూకట్‌పల్లి: జనతానగర్‌కు చెందిన ఎపురాల కృష్ణవేణి కేన్సర్‌తో బాధపడుతోంది. వైద్యులు ఆపరేషన్‌ చేయాలని చెప్పటంతో కుటుంబ సభ్యులు విషయాన్ని కాంగ్రెస్‌ నేత గొట్టిముక్కల వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. ఈ మేరకు మంజూరైన రూ.65వేల ఎల్‌ఓసీ పత్రాన్ని రమేశ్‌తో కలిసి అందజేశారు.

శస్త్రచికిత్స వికటించి మహిళ మృతి



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు



సరస్వతి(ఫైల్‌)

నిజాంపేట్‌: లాప్రోస్కోపిక్‌ సర్జరీ వికటించి ఓ మహిళ మృతి చెందిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన సర్వస్వతి(48), దేవాచారి భార్యాభర్తలు. వీరి పెద్ద కుమారుడు డాక్టర్‌ ప్రమోద్‌ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్యుడిగా పని చేస్తుండగా, చిన్న కుమారుడు దిలీప్‌ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి. ఇటీవల సరస్వతి బాచుపల్లిలోని కౌసల్యకాలనీలో ఉంటున్న తమ బంధువుల ఇంటికి వచ్చింది. ఈ నెల 19న సరస్వతికి తీవ్రంగా కడుపు నొప్పి రావడంతో బాచుపల్లిలోని ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు హెర్నియాతో బాధపడుతోందని గుర్తించి శస్త్ర చికిత్స చేయాలని సూచించారు. ఈ నెల 20న డాక్టర్‌ సతీశ్‌ ఆధ్వర్యంలో సరస్వతికి లాప్రోస్కోపిక్‌ సర్జరీ చేసే క్రమంలో పేగు తెగిపోయింది. దీంతో ఈ నెల 22న రెండోసారి సరస్వతికి ఓపెన్‌సర్జరీ చేశారు. అయితే శస్త్రచికిత్స వికటించడంతో బుధవారం ఆమె మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మృత్యువాత పడిందని ఆరోపిస్తూ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు మృతురాలి బంధువులకు సర్దిచెప్పి అక్కడ నుంచి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆఖరి మజిలీకి అవస్థలే..!

- అధ్వానంగా శ్మశానవాటికలు
- కనీస సౌకర్యాలు కరువు
- ఇబ్బందుల్లో ప్రజలు
- పట్టని అధికారులు

నిజాంపేట్‌: వైకుంఠధామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఓ వైపు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధ పరిస్థితులు కనిపిస్తున్నాయి. నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లోని శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు అంత్యక్రియలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిజాంపేట్‌, బాచుపల్లి, ప్రగతినగర్‌ ప్రాంతాల్లోని శ్మశాన వాటికల్లో నిజాంపేట్‌ మినహా బాచుపల్లి, ప్రగతినగర్‌, సాయినగర్‌, రాజీవ్‌ గాంధీనగర్‌ ప్రాంతాల్లోని వైకుంఠధామాల్లో వసతులు కల్పించాలని పలుమార్లు స్థానిక కార్పొరేటర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక వసతుల కరువు..

బాచుపలి, సాయినగర్‌, రాజీవ్‌గాంధీనగర్‌ తదితర ప్రాంతాల్లో ఉన్న శ్మశాన వాటికల్లో పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి పరిసరాలు అధ్వానంగా మారాయి. అంత్యక్రియలు పూర్తయ్యాక స్నానాలు చేసేందుకు గదులు, మరుగుదొడ్లు లేవు. కొన్ని ప్రాంతాల్లో నిర్వహణ సక్రమంగా లేక నిరుపయోగంగా మారడంతో ట్యాంకర్‌ తెచ్చుకుంటున్నారు. మరికొన్ని చోట్ల లైట్లు లేకపోవడంతో చీకట్లోనే అంత్యక్రియలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశాన వాటికల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎందుకీ నిర్లక్ష్యం..?

శ్మశాన వాటికల అభివృద్ధికి నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ అధికారులు నిధులు కేటాయించే విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కార్పొరేషన్‌లో సుమారు 10 వరకు శ్మశాన వాటికలు ఉన్నాయి. వాటిల్లో 30 శాతం వరకు అభివృద్ధి పనులు జరిగాయి. కానీ మిగితా వాటి విషయంలో ఎందుకు నిధులు కేటాయించి అభివృద్ధి చేపట్టడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.



అధ్వానంగా వైకుంఠధామం



నిరుపయోగంగా వాటర్‌ ట్యాంక్‌

సౌకర్యాల కల్పనకు కృషి ..



నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లోని శ్మశాన వాటికల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటా. ప్రజలకు ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే అధికారుల సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తాను.

– కొలను నీలా గోపాల్‌రెడ్డి

శ్మశాన వాటికలు అభివృద్ధి చేయాలి..



బస్తీలు, కాలనీల్లోని శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలి. అనుకోకుండా ఎవరైనా చనిపోతే శ్మశాన వాటికలోకి వెళ్లేందుకు జేసీబీ తీసుకువచ్చి చదును చేస్తే కానీ వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– ఎండీ జహంగీర్‌, బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు, 21 డివిజన్‌.

అక్రమ కనెక్షన్‌ ఇవ్వడంపై నిరసన

కుత్బుల్లాపూర్‌ : కొంపల్లి మున్సిపాలిటీ సెంట్రల్‌ పార్కులో ఓ భవనానికి ఇచ్చిన డ్రైనేజీ కనెక్షన్‌ వివాదాస్పదంగా మారింది. ఇప్పటికే కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండగా, ఓ ప్రైవేట్‌ హాస్టల్‌ భవనానికి రాత్రికి రాత్రే డ్రైనేజీ మెయిల్‌ లైన్‌ వరకు తవ్వి కనెక్షన్‌ ఇవ్వడంపై మాజీ సింగిల్‌ విండో డైరెక్టర్‌ జెమ్మి దేవేందర్‌ బుధవారం ఉదయం నిరసన తెలిపారు. గతంలో సెంట్రల్‌ పార్కులో డ్రైనేజీ విషయమై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని మున్సిపల్‌ అధికారులు కాసులకు కక్కుర్తి పడి అక్రమంగా డ్రైనేజీ కనెక్షన్‌ ఇచ్చారని ఆరోపిస్తూ రోడ్డు మీద కూర్చొని అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మ్యాన్‌హోల్‌ నిర్మించకుండా నేరుగా మెయిన్‌ లైన్‌కు కనెక్షన్‌ ఇవ్వడం.. పక్కనే ఉన్న నాలుగు కనెక్షన్లు ఇవ్వకపోవడంపై ఏంటని, ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.



రోడ్డుపై నిరసన తెలుపుతున్న సింగిల్‌ విండో మాజీ డైరెక్టర్‌ జెమ్మి దేవేందర్‌

విద్యార్థులకు అన్నిరంగాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్‌ మల్లేశం

సుభాష్‌నగర్‌: విద్యార్థులు అన్ని రంగాలతో పాటు రాజకీయాలపై అవగాహన కలిగి ఉండాలని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్‌ మల్లేశం అన్నారు. గాజులరామారంలోని శ్రీనిధి గ్లోబల్‌ స్కూల్‌లో హెడ్‌బాయ్‌, హెడ్‌గర్ల్‌తో పాటు డిప్యూటీ హెడ్‌ బాయ్‌, డిప్యూటీ హెడ్‌గర్ల ఎంపికకు బుధవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు గాజులరామారం కార్పొరేటర్‌ రావుల శేషగిరి ముఖ్య అతిథిగా హాజరై ఓటింగ్‌ను పర్యవేక్షించారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులకు రాజకీయ పరిజ్ఞానం ఉండాలని, భావి భారత రాజకీయవేత్తలుగా రూపాంతరం చేందేందుకు పాఠశాలే వేదిక అని అన్నారు. ప్రిన్సిపాల్‌ హైమముద్రిక మాట్లాడుతూ ఎన్నికల ప్రాముఖ్యత, ఓటు హక్కు విలువను తెలియజేసేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ ఎన్నికల్లో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్సీని కలిసిన ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌ను జోనల్‌ కార్యాలయంలో బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గాలైన ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్‌, వివేకానందనగర్‌, కూకట్‌పల్లి పార్టుల్లో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జోనల్‌ కమిషనర్‌తో చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తయ్యేలా అధికారులను ఆదేశించాలన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అధిక మొత్తంలోనిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని, పనుల్లో వేగం పెంచాలని కోరారు. వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా చెరువుల సుందరీకరణ, పార్కులు అభివృద్ధి చేపట్టాలని, రోడ్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. అధికారులతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలపై జెడ్సీ అపూర్వ చౌహాన్‌ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

మూసాపేట: భరత్‌నగర్‌ కాలనీలోని హరిహర క్షేత్ర ఆలయ కమిటీ చైర్మన్‌గా పట్లోళ్ల నాగిరెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ మధుబాబు నాగిరెడ్డితో పాటు ఆలయ కమిటీ సభ్యుల సూర్యనారాయణ మూర్తి, సంతోష్‌కుమార్‌, లక్ష్మీనారాయణ, మనెమ్మ, శ్రీనివాసరాజు, వెంకటేష్‌ యాదవ్‌లతో పాటు ఎక్స్‌ అఫీషియో మెంబర్‌గా కృష్ణ సూరిలచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ నిర్వాహణాధికారి విజయభారతి, మేడ్చల్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు పాల్గొన్నారు.